సాక్షి ఏలూరు

ఆదివారం । 28 ఏప్రిల్ । 2024



వర్జీనియా.. రయ్ రయ్

వర్జీనియా పొగాకు ధర రయ్ రయ్‌మంటూ పరుగులు పెడుతోంది. రికార్డు స్థాయిలో మూడు కేంద్రాల్లో కిలోకు రూ.341 ధర దాటి ఆశ్చర్యపరిచింది. 8లో ▸



చింతమనేని దౌర్జన్య కాండ

దళితులపై టీడీపీ నేత చింతమనేని దౌర్జన్య కాండ ఆగడం లేదు. పెదవేగి మండలంలో దళితులపై ఆయన దౌర్జన్యానికి దిగి దాడి చేసి దూషణలకు పాల్పడ్డారు. 8లో ▸



శ్రీనివాసా.. గోవిందా

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి.

న్యూస్‌రీల్

సమర్థవంతంగా ఓటరు స్లిప్పుల పంపిణీ



వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్

ఏలూరు(మెట్రో): సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఓటరుకు షెడ్యూల్ ప్రకారం ఓటరు స్లిప్పులు (ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్) పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వీటిని పంపిణీ చేస్తామన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు గడువు పెంపు

ఏలూరు(మెట్రో): ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ గడువును వచ్చేనెల 1 వరకు పొడిగించిందని, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వచ్చేనెల 6 నుంచి 8 వరకు వినియోగించుకోవచ్చన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు రక్షణ కిట్లు



వేసవి రక్షణ కిట్లు అందిస్తున్న రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ట్రాఫిక్ పోలీసులు అధికారులు, సిబ్బంది ప్రజలకు తమ సేవలు అందించేందుకు నిత్యం రోడ్లపైనే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎండ తీవ్రత దృష్ట్యా ఏలూరు ట్రాఫిక్ సిబ్బందికి ఎండ వేడిమి, వడగాలుల నుంచి రక్షణకు సమ్మర్ కిట్లు అందజేశారు. శనివారం ఏలూరులో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చేతులమీదుగా ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సమ్మర్ కిట్లు అందజేశారు. తలకు హ్యాట్, కూలింగ్ వాటర్‌బాటిల్, బ్యాగ్, నల్లకళ్ల జోడును సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు రోజూ 8 గంటల పాటు ఎండలోనే రోడ్లపైనే విధులు నిర్వర్తిస్తూ ఉంటారనీ, ఒకవైపు ఎండవేడిమి, మరోవైపు వాయు కాలుష్యంతో అనారోగ్యం పాలయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయనీ, వాటి నుంచి రక్షణ కావాలని అన్నారు. గతేడాది ఇదేవిధంగా ట్రాఫిక్ సిబ్బందికి కిట్లు అందజేశామనీ, రెండో ఏడాది కూడా సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పంపిణీ చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్లు అందిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏలూరు ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు, ఏలూరు ట్రాఫిక్ స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

కామినేని కట్టుకథలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఒట్టు వేసి ఒక మాట.. వేయకుండా ఒక మాట చెప్పను.. ఇది పాపులర్ సినిమా డైలాగ్. అయితే ఈ నేత మాత్రం ఒట్టు వేసి మరీ చెప్పిన మాటలను అధికారంలోకి రాగానే కొల్లేటిలో కలిపేస్తారు. మళ్లీ ఎన్నికలు రాగానే అవే హామీలు, మాటలను మళ్లీమళ్లీ చెబుతూ ప్రజలను మభ్యపెట్టడం పరిపాటిగా మార్చుకున్నారు. ఆయనే కైకలూరు బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్. తనకు విస్తృత పరిచయాలు ఉన్నాయని.. కొల్లేరు సమస్యలు నరేంద్ర మోదీతో మాట్లాడి సెటిల్ చేస్తానని.. జలజీవన్ మిషన్ మనదేనని.. ఇంటింటికీ మంచినీరు ఇస్తానని ఇలా బిల్డప్ బాబాయ్ మాదిరిగా అర్థగోలుగా మాటలు చెబుతూ రాజకీయం చేస్తుంటారు. కేవలం మూడు పార్టీలు ఉంటేనే కూటమి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలవడం, మూడు పార్టీలు లేకపోతే బీజేపీని స్థానికంగా గాలికి వదిలేసి విదేశాల్లో ఉండటం ఆయనకు సర్వసాధారణం. ప్రస్తుత ఎన్నికల్లోనూ ఇలాంటి మోసపూరిత హామీలు, ఒట్లతో కామినేని కైకలూరులో ప్రచారం చేస్తున్నారు.

బిల్డప్ బాబాయ్

- కొల్లేరుపై మళ్లీ అవే బూటకపు హామీలు
- కూటమి ఉంటేనే కైకలూరులో కనిపించే నేత
- సెంటిమెంట్ మాటలు.. ఒట్టు వేసి మరీ హామీలు
- గెలిచే వరకు కైకలూరు.. ఆ తర్వాత వేరే ప్రాంతాల్లో..
- మళ్లీ ప్రజలను మభ్యపెడుతూ కామినేని ప్రచారం



జెండాలు జతకడితేనే..

కామినేని శ్రీనివాస్ తనని తాను బీజేపీ నేతగా అభివర్ణించుకుంటారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా కైకలూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయితే బడా వ్యక్తులతో ఆర్థిక సంబంధాలు, బంధుత్వాలతో బీజేపీ పెద్దాయన సూచనలతో 2014లో బీజేపీలో చేరి కైకలూరు నుంచి కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. మొదటిసారి గెలిచిన వెంటనే చంద్రబాబు కేబినెట్‌లో ఆరోగ్యశాఖ మంత్రిగా కొనసాగారు. కట్ చేస్తే.. 2019లో జనసేన, బీజేపీ, టీడీపీ పొత్తు లేకపోవడంతో హైదరాబాద్, అమెరికాకు పరిమితమై స్థానిక బీజేపీని పూర్తిగా నిర్వీర్యం చేసి టీడీపీ నేతలకు సహకారం అందించారు. ఫలితంగా టీడీపీ ఘోరంగా ఓడిపోవడంతో ఐదేళ్ల పాటు కైకలూరు వైపు కన్నెత్తి చూడలేదు. తాజాగా పొత్తు ఆశలు చిగురించడం, మూడు పార్టీల చర్చలు మొదలు కావడంతో మళ్లీ కైకలూరు తనదేనంటూ హడావుడి మొదలుపెట్టి జెండా.. అజెండా లేకుండా నియోజకవర్గంలో కొద్దిరోజులు తిరిగారు. టికెట్ ఖరారు కావడంతో బీజేపీ అభ్యర్థిగా మళ్లీ తిరుగుతున్నారు.

పెద్దింట్లమ్మపై ఒట్టు

కామినేని శ్రీనివాస్‌కు ఒట్లు వేయడం బాగా అలవాటు. ఒక్కోసారి ఒక్కో దేవుడిని వాడుకుంటారు. ఒకసారి కాణిపాకం వినాయకుడు, మరోసారి కైకలూరు శ్యామలాంబ, కొల్లేటికోట పెద్దింట్లమ్మ, ఆయన స్వగ్రామంలో లక్ష్మీనృసింహ స్వామి ఇలా అందరిపైనా ఒక రౌండ్ ఒట్లు వేశారు. 2014లో కాంటూరు కుదింపు, పెద్దింట్లమ్మ వారధి నిర్మిస్తానని కొల్లేటికోట పెద్దింట్లమ్మపై ఒట్టు వేసి నెరవేర్చని కామినేని తిరిగి మళ్లీ ఇటీవల అమ్మవారిపై కొల్లేరు సమస్యలు పరిష్కరిస్తానని ఒట్టు వేశారు. చనిపోయిన తన అమ్మ చివరి కోరిక ఎమ్మెల్యే కావడం.. భవిష్యత్తులో ఇక పోటీ చేయనని, ఈసారి కొత్తగా అమ్మ సెంటిమెంట్‌తో జనాల్లోకి వెళుతున్నారు.

అవే హామీలు మళ్లీ మళ్లీ

76 ఏళ్ల వయసున్న కామినేని శ్రీనివాస్ 2014లో ఇచ్చిన హామీలనే మళ్లీమళ్లీ చెబుతూ సరికొత్తగా ప్రజలను మోసం చేయడానికి అమ్మ సెంటిమెంట్, దేవుళ్లపై ఒట్లు వేస్తూ ప్రతిచోటా మాట్లాడుతున్నారు. వాస్తవానికి కొల్లేరు అభయారణ్యం 77,131 ఎకరాల్లో ఉంది. కొల్లేరు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని, 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదిస్తానని, కేంద్రంలో బీజేపీ ఉంది కాబట్టి నేరుగా మోదీతోనే మాట్లాడతానని పదేళ్ల క్రితం కొల్లేరు ప్రజలకు మాయమాటలు చెప్పారు. వెంటనే గోదావరి పుష్కరాలకు కేంద్ర మంత్రులు ప్రకాష్, జవ్‌దేకర్ రాజకీయ గురువు వెంకయ్యనాయుడు, అప్పటి రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డిలు వస్తే వారిని కైకలూరు తీసుకువచ్చి కొల్లేరుపై సర్వే చేస్తామని, వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోయారు. అప్పటినుంచి ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వమే ఉన్నా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇక కొల్లేటి పెద్దింట్లమ్మ అమ్మవారి వారధిని తన పుట్టినరోజున ప్రారంభిస్తానని బలంగా చెప్పారు. రహదారుల నిర్మాణం, లంక గ్రామాలన్నింటికీ తాగునీరు అందిస్తామని 2014లో హామీ ఇచ్చారు. వీటిలో పెద్దింట్లమ్మ వారిధిని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పనులను వేగవంతం చేసి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. ఏలూరు–కైకలూరు ప్రధాన రహదారి, ఇతర ప్రధాన రహదారులు ఎక్కువ శాతం పూర్తి చేశారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు మంచి నీరు అందించే ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. అయితే కామినేని మాత్రం పూర్తయిన పనులు, ప్రాజెక్టులను కూడా చూసుకోకుండా హామీలు ఇస్తుండటంపై కూటమి నేతల్లో తీవ్ర చర్చ సాగుతుంది.

మేనిఫెస్టోపై దళితుల హర్షం



బొర్రంపాలెంలో జేజేలు పలుకుతున్న దృశ్యం

టి.నరసాపురం: 500 మంది దళితుల నివాసిత ప్రాంతాలను ప్రత్యేక పంచాయతీలుగా రూపకల్పన చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం ప్రకటించిన మేనిఫెస్టోలో పేర్కొనడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. బొర్రంపాలెంలో అంబేడ్కర్‌వాదులు, దళితులు స్థానిక ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు గుండె పాండురంగ మాట్లాడుతూ దళితులు పాలకులు కావాలన్న అంబేడ్కర్ ఆశయాన్ని సీఎం జగన్ నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో ద్వారా సాకారం చేయనున్నారన్నారు. సీఎం జగన్‌కు దళితులంటే అమితమైన ప్రేమ అని, నా ఎస్సీ.. నా ఎస్టీ.. నా బీసీ అంటూ వారిని గుండెల్లో పెట్టుకుని వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు దళితులను విభజించి వారి మధ్య విద్వేషాలు రెచ్చగొట్టిన ఘనుడని విమర్శించారు. కార్యక్రమంలో కర్రె జక్రయ్య, గుండె చిట్టియ్య, ములగిరి నాగరాజు, సోడెం బాలకృష్ణ, గుండె రమేష్, మైల వెంకటేష్, కాకర్ల శ్రీను, గుండె రాము, చల్లా ధర్మయ్య, రాయల దుర్గారావు పాల్గొన్నారు.

అవినీతి నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా..



మాట్లాడుతున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: తాను ఒక్క రూపాయి అవినీతికి పాల్పడినట్టు నిరూపించినా శాశ్వతంగా రాజకీయాల్లో నుంచి తప్పుకుంటానని.. నిరూపించడానికి పురందేశ్వరి సిద్ధమా అని హోం మంత్రి, వైఎస్సార్‌సీపీ గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత సవాల్ విసిరారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెంలో శనివారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. మూడు రోజుల క్రితం యర్నగూడెం వచ్చిన రాజమండ్రి బీజేపీ ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనపై చేసిన అవినీతి ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. కొవ్వూరు ఇసుక రవాణాలో తనకు ఒక్క రూపాయి అయినా చేరినట్టు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. పక్క జిల్లాల్లో తనకు ఆస్తులు ఉన్నాయని ఆమె ఆరోపించారని, ఆ ఆస్తులకు సంబంధించిన పత్రాలను దయచేసి తనకు అందజేయాలని కోరారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్ చదవడం మాని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ఆమె హితవు పలికారు. ఎన్నికల్లో ఎదుర్కొనే సత్తా లేక ఇలా తనపై బురదచిమ్మే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని మంత్రి వనిత మండిపడ్డారు.

సంక్షేమం, అభివృద్ధి అజెండాగా..

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించారని ప్రజాప్రతినిధులు అన్నారు. ఎన్నికల హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. 2024 ఎన్నికల మేనిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందన్నారు.

మేనిఫెస్టోతో అగ్రగామిగా..



దెందులూరు: సీఎం జగన్ ప్రకటించిన వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో ప్రజల భవిష్యత్తు, అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం అగ్రగామిగా ఉంటుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. విద్య, వైద్యం, రైతులు, మహిళలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు తనదైన శైలిగా అధిక ప్రాధాన్యమిస్తూ గత ఐదేళ్లలో అమలు చేసిన నవరత్నాల పథకాలతో పాటు ఇతర సంక్షేమ పథకాలు కొనసాగించడం సంతోషంగా ఉందన్నారు.

మేనిఫెస్టో అద్భుతం



గణపవరం: వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో అద్భుతమని, ఈ దెబ్బకు కూటమికి చెమటలు తప్పవని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. జగన్ ఇచ్చిన హామీలు ఆచరణ సాధ్యమైనవని, కూటమి ఉమ్మడి మేనిఫెస్టో ఆచరణ సాధ్యం కానిదన్నారు. సీఎం జగన్ చెప్పారంటే.. చేస్తారంతే అని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారన్నారు. చంద్రబాబువి బూటకపు హామీలని, 2014లో ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు.

పవిత్ర గ్రంథంలా..



బుట్టాయగూడెం: సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో పవిత్రమైన గ్రంథం లాంటిదని పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. 2019లో మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేసి చూపించారన్నారు. ప్రజలను మోసం చేయకుండా అమలు చేసేవి మాత్రమే సీఎం జగనన్న మేనిఫెస్టోలో పొందుపర్చడం అభినందనీయమన్నారు. దీని ద్వారా పేదలకు మరింత మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దన్నారు.

ఆకాంక్షలకు అనుగుణంగా..



దెందులూరు: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికతో భవిష్యత్ అవసరాలు గుర్తెరిగి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్న ప్రజానేతగా సీఎం జగన్ నిలిచారని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మోసపూరితమైన ప్రతిపక్షాల హామీల్లా కాకుండా చక్కటి సంక్షేమాన్ని ప్రజలకు కొనసాగించాలన్న జగనన్న ఆశయం మేనిఫెస్టోలో ప్రస్ఫుటంగా కనిపించిందన్నారు. జగనన్న సంక్షేమ రారాజుగా నిలిచిపోతారన్నారు.

చెప్పారంటే.. చేస్తారంతే..



బుట్టాయగూడెం: దేశంలోనే ఎక్కడాలేని విధంగా ప్రకటించిన మేనిఫెస్టోను నూరు శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మేనిఫెస్టోలో విద్య, వైద్య రంగాలకు తొలి ప్రాధాన్యమివ్వడం శుభపరిణామమమన్నారు. అలాగే నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటు ఆనందదాయకమన్నారు. జగన్ చెప్పారంటే.. చేస్తారంతే అని బాలరాజు అన్నారు.

మహిళలకు పెద్దపీట



పెదపాడు: సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో పేదలు, మహిళలకు పెద్దపీట వేశారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మహిళలకు రూ.3 లక్షల వరకు సున్నావడ్డీ రుణాలు అందిస్తారని, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లకు విద్య, వైద్య విభాగాల్లో, నవరత్న పథకాలు అందిస్తామని ప్రకటించారన్నారు. సీఎం జగన్ చెప్పారంటే.. చేస్తారంతే అనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉందన్నారు. ఆ విశ్వాసంతోనే జగనన్నకు పట్టం కట్టనున్నారన్నారు.

పాలన మెచ్చి.. సంక్షేమం వెంట నిలిచి..

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

మండవల్లి: రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ క్రియాశీలక నాయకుడు మంగినేని నాగవెంకట రామాంజనేయ గాంధీ (బాబ్జి) శనివారం మండవల్లిలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సమక్షంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి డీఎన్నార్, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ గెలుపునకు కృషిచేస్తానని మంగినేని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మోత్రు యేసుబాబు, సాక్షి సాయిబాబు, టి.సత్యనారాయణ, ఆర్.నరసింహారావు ఉన్నారు.

ఎన్నికల్లో సత్తాచాటాలి

చింతలపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తాచాటాలని చింతలపూడి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కె.విజయరాజు పిలుపునిచ్చారు. రేచర్ల పంచాయతీలో టీడీపీకి చెందిన ఉలాస శ్రీనివాసరావు, వార్డు సభ్యురాలు రాణి వారి అనుచరులతో కలిసి సుమారు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి విజయరాజు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. నియోజకవర్గ పరిశీలకుడు గోరుముచ్చు గోపాల్ యాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, సర్పంచ్ కె.శివరామకృష్ణ, నాయకులు ఉన్నారు.

జగన్ సీఎం కావడం ఖాయం

నూజివీడు: జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లింగాల సౌజన్య తన అనుచరులతో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే ప్రతాప్ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కొప్పుల ప్రదీప్‌కుమార్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు: ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ లింగాల సౌజన్య, అనుచరులు



కుక్కునూరు: సీతారాములును పార్టీలోకి ఆహ్వానిస్తూ..



ఉంగుటూరు: రాచూరులో ఎమ్మెల్యే వాసుబాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు



మండవల్లి: ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సమక్షంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ నేత గాంధీ



నూజివీడు: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో చంటినాయన



చింతలపూడి: రేచర్లలో కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి విజయరాజు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పథకాలు

నూజివీడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్యే తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. నూజివీడులోని మూడో వార్డులో షేక్ బాజీ, షేక్ రంజానీలతో పాటు వారి అనుచరులు 20 మంది చంటినాయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకుల మేకల అనిల్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ముస్లీం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ యూనస్‌పాషా(గబ్బర్) ఉన్నారు.

నిష్పక్షపాత పాలన

కుక్కునూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నిష్పక్షపాత పాలనను ప్రజలంతా కోరుకుంటున్నారని, అందుకే జగనన్న మరలా ముఖ్యమంత్రి కావడం కోసం పార్టీలో చేరుతున్నామని బోనగిరి గ్రామానికి చెందిన బీజేపీ నేత కుంజా సీతారాములు అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇబ్రహీంపేటకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. అనంతరం మారేడుబాక గ్రామంలో బర్ల పార్వతి, కొండపల్లి సత్యవతి, బొల్లి లక్ష్మి పార్టీలో చేరారు. మండలాధ్యక్షులు కుచ్చర్లపాటి నరసింహరాజు, నాయకులు ఉన్నారు.

జనసేన, టీడీపీని వీడి..

ఉంగుటూరు: మండలంలోని రాచూరు గ్రామంలో దళితపేట యువకులు జనసేన, టీడీపీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం ఎంపీటీసీ సభ్యుడు శింగలూరి సూర్యనారాయణ, గంటా సురేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుప్పాల వాసబాబు సమక్షంలో పార్టీలో చేరారు. గూడా సుధాకరరావు, గూడా నాగూరు, తప్పిట్ల వెంకట్రావు, పాండ్రాకరాజారావు, వల్లపు పెద పిచ్చియ్య, ఎరిచెర్ల పుష్ప, కమ్మిన వెంకటలక్ష్మి, గూడా రజని పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

చింతలపూడి ఆర్వోపై ఫిర్యాదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చింతలపూడి ఎన్నికల రిటర్నింగ్ అధికారిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు రిటైర్డ్ ఎంఈఓ ఎస్.ధర్మదాసు శనివారం ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ సుమారు 15 ఏళ్లుగా అమెరికాలో ఉద్యోగం చేస్తూ తన కుటుంబంతో నివాసం ఉంటూ, గ్రీన్‌కార్డ్ కలిగి ఉంటూ, ఫారం 6ఏ కింద ఓటరుగా నమోదు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే ఇవేమీ పట్టించుకోకపోవడంతో పాటు అమెరికాలో బ్యాంకు ఖాతాలు, బీమా, ఆస్తులు, పన్నులు, రుణాలు, అమెరికాలోని చిరునామాను అఫిడవిట్‌లో మరుగుపరిచారని తెలిపారు. ఆయా విషయాలను వివరిస్తూ రోషన్‌కుమార్‌కు ముందుగానే లీగల్ నోటీసు పంపి అభ్యంతరాలను తెలియజేసినా ఆయన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి అంగీకరించడం చట్టవిరుద్ధమని తెలిపారు. సొంత విచారణ చేసి కూడా నామినేషన్‌ను తిరస్కరించాల్సి ఉండగా రిటర్నింగ్ అధికారి తన పదవిని దుర్వినియోగం చేసిన అంశంపై తక్షణ చర్యలు చేపట్టి, చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు ధర్మదాసు తెలిపారు. అవసరమైతే హైకోర్టులో రిట్ ఫైల్ చేస్తానని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

సీఐ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లకు రిమాండ్

అవినీతి కేసు విచారణ చేస్తున్న ఏసీబీ

ఏలూరు టౌన్ : ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేస్తూ ఏసీబీకి చిక్కిన వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు రాజేంద్ర, ఇస్సాక్‌ను ఏసీబీ అధికారులు శనివారం రాజమహేంద్రవరంలోని ఏసీబీ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అనంతరం వీరిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసులో సీఐ వెంకటేశ్వరరావు ఇంట్లోనూ ఏసీబీ అధికారులు శనివారం రాత్రి వరకు తనిఖీ చేశారు. కొంత నగదు, బంగారం, విలువైన ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో కొన్ని బుల్లెట్లు లభ్యం కాగా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఏసీబీ డీఎస్పీ వీ.సుబ్బరాజును వివరణ కోరగా సీఐ ఇంట్లో తనిఖీలు చేశామని బంగారం, ఆస్తి పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువను అంచనా వేయాల్సి ఉందన్నారు.

త్రీటౌన్ ఇన్‌చార్జి సీఐగా శ్రీనివాసరావు

ఏలూరు త్రీటౌన్ ఇన్‌చార్జి సీఐగా కే శ్రీనివాసరావును పోలీసు ఉన్నతాధికారులు శనివారం రాత్రి నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వేల్పుచర్లలో చోరీ

ముసునూరు: వేల్పుచర్లలో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై పి.వాసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేల్పుచర్లలో పోలగాని రవి గురువారం ఇంటి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామాంతరం వెళ్లారు. శనివారం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం బద్దలుకొట్టి ఇంట్లో ఉన్న రూ.50వేల విలువైన బంగారం, బైక్ కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆగని చింతమనేని దౌర్జన్య కాండ

- ఎన్నికల ప్రచారంలో దళితులపై చింతమనేని, అనుచరుల దాష్టీకం
- జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి బాగుందని చెప్పడంతో కొట్టిన చింతమనేని
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి ఎందుకు మారారంటూ అనుచరుల దాడి
- ఎస్సీ, బీసీ సంఘాల ఆగ్రహం.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు



బాధితులు రామానుజం శివసాయి, రామానుజం పవన్‌కుమార్, జెర్రిపోతుల మధు, యర్రా చంటిబాబు

దెందులూరు/పెదవేగి : దళితులపై టీడీపీ నేత చింతమనేని దౌర్జన్య కాండ ఆగడం లేదు. పెదవేగి మండలంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో దళితులపై చింతమనేని, అతని అనుచరులు దౌర్జన్యానికి దిగి దాడి చేసి దూషణలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు చింతమనేని ప్రభాకర్‌పై, ఆయన అనుచరులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, మరో రెండు కేసులు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలంలో శుక్రవారం రాత్రి దిబ్బగూడెం, లక్ష్మీపురం, కూచింపూడి, రామశింగవరంలలో చింతమనేని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లక్ష్మీపురం ప్రచారంలో దళితుడు యర్రా చంటిబాబు ఇంటి వద్దకు చింతమనేని ప్రభాకర్ వెళ్లి తమకు ఓటు వేయాలని కోరారు. దీనిపై చంటిబాబు స్పందిస్తూ జగన్ అన్ని సంక్షేమ పథకాలు ఇవ్వడంతో పాటు అభివృద్ధి చేశారని చెప్పడంతో చింతమనేని ఆగ్రహంతో తలపై కొట్టగా స్పృహ కోల్పోయి వెనుక ఉన్న దడిపై పడిపోయాడు. చింతమనేని అనుచరులు కూడా అతనిని కొట్టి చంపేస్తామని బెదిరించారు. దీంతో బాధితుడు చంటిబాబు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, చింతమనేని, ఆయన అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, 324, 323, 506, రెడ్ విత్ 34 యాక్ట్‌ల ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ కేసులో చింతమనేని ప్రభాకర్‌ను ఎ1గా నమోదు చేశారు. అలాగే కూచింపూడిలో రామానుజం శివసాయి, రామానుజం పవన్‌కుమార్ వైఎస్సార్ సీపీలో చేరడంపై వారిని నిలదీస్తూ టీడీపీ నుంచి ఎందుకు వైఎస్సార్ సీపీలో చేరారంటూ చింతమనేని, అనుచరులు ప్రశ్నించారు. ఎందుకు పార్టీ మారారంటూ దౌర్జన్యం చేశారు. మా దమ్ము ఏమిటో చూపిస్తాం, తడాఖా చూపిస్తామంటూ రాళ్లతో వారిని కొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు టీడీపీ కార్యకర్తలు, చింతమనేని అనుచరులపై 323, 324, 506 సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ప్రచారంలో భాగంగా కూచింపూడి–రామశింగవరం సరిహద్దుల వద్ద ఉన్న వాటర్ ట్యాంకు వద్దకు చేరుకున్న చింతమనేని అక్కడ దళితులను ఉద్దేశించి మాట్లాడుతూ మీకు రాజకీయాలు ఎందుకురా అంటూ కులం పేరుతో దూషించడమే కాక కర్రలతో దాడి చేశారు. రామశింగవరం గ్రామానికి చెందిన జెర్రిపోతుల మధు ఫిర్యాదు మేరకు రామానుజం బాలాజీ, సవరం అభి, పెద్దిశెట్టి బాలనాగరాజు, నన్నపనేని గంగాధర్, పగడాల ప్రసాద్‌లపై 323, 324, 506 సెక్షన్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మణ్, మిగిలిన కేసులను పెదవేగి సీఐ శ్రీనివాస కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్లు అడగడానికి వచ్చి కొట్టారు



టీడీపీ నాయకుడు చింతమనేని ప్రభాకర్ మా ఇంటికి వచ్చి ఈసారి మాకు ఓటేయాలి అని అడిగాడు. జగన్ ప్రభుత్వంలో మాకు అంతా మంచి జరిగిందని నా కొడుకు చంటిబాబు చెప్పగానే కులం పేరుతో దూషించి నీ పేగులు బయటకు తీస్తా అంటూ దౌర్జన్యంగా కొట్టాడు. మమ్మల్ని చాలామంది ఓట్లు వేయాలని అడిగేందుకు వచ్చారు కానీ, ఈ విధంగా ఎవరూ చేయలేదు.

– యర్రా రాహేలు, బాధితుడి తల్లి

అన్యాయంగా కొట్టారు



కూచింపూడిలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేసేందుకు వచ్చి అన్యాయంగా మా ఇద్దరి కుమారులపై చింతమనేని, అతని అనుచరులు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. గత కొద్ది రోజుల క్రితం మేము టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాం. ఈ కక్షతో మాపై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఇది చాలా దుర్మార్గం.

– రామానుజం సాంబశివరావు, కూచింపూడి

మూకుమ్మడిగా దాడి చేశారు



కూచింపూడి–రామసింగవరం సరిహద్దుల్లో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అనుచరులు మా చిన్నమ్మ కొడుకు జెర్రిపోతుల మధుపై మూకుమ్మడిగా దాడి చేసి కొట్టారు. ఒక్కడిని చేసి అందరూ కొట్టారు.

– పల్లి దుర్గారావు, రామసింగవరం

దళితులను టార్గెట్ చేస్తున్నారు



టీడీపీ నాయకులు దళితులను టార్గెట్ చేసి చులకన భావంతో దుర్భాషలాడుతూ విచక్షణరహితంగా దాడులకు పాల్పడటం దుర్మార్గమైన చర్య. దళితులపై దాడులు చేయడం ప్రభాకర్‌కు మొదటిసారి ఏమీ కాదు. నియోజకవర్గంలో దళితులపై దాడులను నియంత్రించాలంటే జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలి.

– గొట్టేటి స్టాలిన్, మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు, పెదవేగి

కేసుల సెంచరీకి చేరువలో..

అఫిడవిట్‌లో 93 కేసులు.. నేడు కేసుతో 94

దెందులూరు/పెదవేగి : దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌కు తను దాఖలు చేసిన నామినేషన్‌లో 93 కేసులు వివిధ పోలీస్‌స్టేషన్లల్లో నమోదు అయ్యాయని అఫిడవిట్‌లో చూపించారు. ఇంకా వారం రోజులు కూడా గడవకముందే ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, మరో రెండు కేసులు నమోదయ్యాయి. ఎన్నికల ప్రచారం పేరిట దళితుడిపై విచక్షణారహితంగా దాడి చేసిన కేసుల్లో మరోమారు పోలీసు కేసుల్లోకెక్కారు. కాగా కేసుల సెంచరీకి దగ్గరలో ఉన్న ఏకైక రాజకీయ నేత, టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్.

ప్రధాన కేసులు

- ఎంపీపీగా ఉన్న సమయంలో పది కేసులు
- 2015లో ఏలూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ నమోదు
- 2011లో నవంబర్ 26న దెందులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో అప్పటి రాష్ట్ర మంత్రి వట్టి వసంత్ కుమార్‌పై విచక్షణ రహితంగా దాడి
- 2015లో జూలై 11న ముసునూరు తహసీల్దార్ వనజాక్షిపై దాడి చేసి ఇసుకలో ఈడ్చివేసిన ఘటనపై..
- 2016 ఫిబ్రవరి 10న దెందులూరులో కానిస్టేబుల్ మధు, వారి కుటుంబ సభ్యులపై ఇటుక రాళ్లతో దాడి
- పెదవేగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై ఆనందరెడ్డిపై దౌర్జన్యం
- పోలవరం కుడికాలు గట్టుపై అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మేడికొండ కృష్ణారావును దాడి
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌పై ఇప్పటివరకు 94 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మాజీ మంత్రి వట్టి వసంత్ కుమార్‌పై దాడి కేసులో భీమడోలు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించగా, ప్రస్తుతం ఆ కేసు జిల్లా కోర్టులో వాదనల్లో ఉంది.

జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ మేలు

రాచూరు ప్రచారంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



రాచూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడిగా పేరు తెచ్చుకున్న సీఎం వైఎస్ జగన్ అన్నివర్గాలకు మేలు జరిగేలా మేనిఫెస్టో విడుదల చేశారని ఉంగుటూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం రాచూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం సీఎం వైఎస్ జగన్ ఎంతటి కష్టాన్ని అయినా మోస్తారన్నారు. గత అయిదేళ్ల పాలనే ఇందుకు తార్కాణమన్నారు. చంద్రబాబు హామీలు ఇస్తారే గాని అమలు చేయరని గతంలో రుజువైందని, ఇవన్నీ గ్రహించి ఇపుడు జరగుతున్న ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు. రాచూరు మాజీ సర్పంచ్, పార్టీ నాయకుడు రామిరెడ్డి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శింగిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ మరడ రమావతి, పార్టీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, పార్టీ సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గాదిరమణ పాల్గొన్నారు.

జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

కొణిజర్ల ప్రచారంలో వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కె విజయరాజు



కొణిజర్ల ప్రచారంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డితోనే మరింత సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని చింతలపూడి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. శనివారం కొణిజర్లలో గ్రామ సర్పంచ్ నూజివేటి జయశ్రీ ఆధ్వర్యంలో కె.విజయరాజు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు, మహిళలు విజయరాజుకు హారతులు ఇచ్చి, బాణసంచా కాల్పులు, తీన్‌మార్ డప్పుల నడుమ ఘనస్వాగతం పలుకుతూ పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ ప్రజాప్రభుత్వాన్ని మరోసారి స్వాగతించాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దుక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, (బీవీఎస్ రెడ్డి), దయాల నవీన్‌బాబు, మందలపు సాయిబాబు, మట్టా సురేష్, సొంగా సందీప్, కొఠారి మోహన్, ముసునూరి వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి వరప్రసాద్, ఉప్పలపాటి గోపి, అన్నపనేని శాంతరావు పాల్గొన్నారు.

చింతమనేనిని అరెస్టు చేయాలి

దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: దళితులపై దాడి చేసిన చింతమనేని ప్రభాకర్‌ను వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి డిమాండ్ చేశారు. శనివారం దెందులూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడారు. ఇప్పటికే చింతమనేనిపై పలు పోలీస్‌స్టేషన్లలో 93 కేసులు ఉన్నాయని, అయినప్పటికీ అతని ప్రవర్తన రోజురోజుకీ మరింత దిగజారుతోందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై చింతమనేని దాడులు చేసి తిరిగి తమపైనే ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి వ్యక్తికి టికెట్ ఇచ్చిన చంద్రబాబు దళితులకు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. నియోజకవర్గంలో దళితులు ఆగ్రహంతో రగిలిపోతున్నారన్నారు. ఓటమి భయంతో చింతమనేని సైకోలా ప్రవర్తిస్తున్నాడన్నారు. దమ్ముంటే తమను ఎన్నికల్లో ఎదుర్కోవాలని, కానీ దళితుల జోలికి వస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. ప్రణాళిక ప్రకారం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై మూడు చోట్ల దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా చింతమనేని దాడి చేసి దుర్భాషలాడుతున్న వీడియోను ఎమ్మెల్యే కొఠారు సమావేశంలో ఫోన్ ద్వారా చూపించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ చింతమనేని ప్రభాకర్ రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసినా దళితులపై దాడులు, దౌర్జన్యాలు మానలేదన్నారు. మీకెందుకు రాజకీయాలు.. అంటూ దళితులను కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకే రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీకి, దెందులూరులో చింతమనేనికి గుణపాఠం నేర్పారని గుర్తుచేశారు. అయినా బుద్ధి రాకపోవడం సిగ్గుచేటన్నారు. చింతమనేని తీరుపై వెంటనే ఎన్నికల కమిషన్‌కు, ఎస్సీ కమిషన్‌కు, కోర్టులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ నియోజవర్గంలో బీసీలు, ఎస్సీలను కించపరిచేలా మాట్లాడటం చింతమనేనికి అలవాటుగా మారిందన్నారు. ఒకసారి బుద్ధిచెప్పినా మార్పు రాకపోతే బీసీలు, ఎస్సీలు శాశ్వతంగా బుద్ధి చెబుతారని, ఈ ఎన్నికలే చింతమనేనికి చివరి ఎన్నికలని స్పష్టం చేశారు. ప్రజలందరూ చింతమనేని తీరును గమనిస్తున్నారని, ఈసారి అతను డిపాజిట్లు కూడా రాకుండా రాజకీయాలకు దూరం కావడం తథ్యమని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులు నిట్టా లీలానవకాంతం, విజిలెన్స్ కమిటీ సభ్యుడు కత్తుల రవి మాట్లాడారు. కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మండలి కొండలరావు, పులవర్తి దేవానంద్, పర్వతనేని నాగయ్య, గుంపుల ఇస్రాయేలు, గొట్టేటి స్టాలిన్, తాతా సత్యనారాయణ, సర్పంచ్ ప్రభుదేవ, బళ్ల విజయ్‌కుమార్, బాధిత సోదరుడు, న్యాయవాది యర్రా సురేష్ పాల్గొన్నారు.

వర్జీనియా ధర.. రయ్ రయ్

- రికార్డు స్థాయిలో రూ.341కు చేరిన కిలో ధర
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న పొగాకు రైతులు
- సకాలంలో విక్రయించుకోవాలంటున్న బోర్డు అధికారులు




కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : వర్జీనియా పొగాకు ధర రయ్ రయ్‌మంటూ పరుగులు పెడుతోంది. ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాలలో శనివారం నిర్వహించిన వేలం ప్రక్రియలో రికార్డు స్థాయిలో మూడు చోట్ల కిలో ధర రూ.340కు చేరగా, రెండు చోట్ల రూ.341 మార్కును దాటింది. దీంతో రైతులు ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. అంతర్జాతీయంగా నాణ్యమైన పొగాకు ఉత్పత్తి మిగిలిన దేశాలలో దిగుబడి లేకపోవడం, ఎస్ఎల్ఎస్ పరిధిలోని రైతాంగానికి వరంగా మారింది. దీంతో కంపెనీలు గుత్తాధిపత్యాన్ని వీడి ధరలు పెంచుకుంటూ పోవడంతో రైతులకు కలిసి వచ్చింది. పొగాకు కొనుగోళ్లు ప్రారంభమైన యాభై రోజుల వ్యవధిలోనే రూ.240 నుంచి రూ.340కు చేరుకుందని, ఇలా తక్కువ వ్యవధిలో రూ.100 ఎక్కువగా పెరగడం వర్జీనియా వేలం చరిత్రలోనే లేదని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా పొగాకు కొనుగోలు చేసే కంపెనీల మధ్య వారం వ్యవధిలో నాలుగు మార్లు సమావేశాలు నిర్వహించగా, వారిలో ఏకాభిప్రాయం రాకపోవడంతో ప్రధాన కంపెనీలు ధరలు పెంచుకుంటూ వెళుతున్నాయని ఓ ప్రధాన కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు.

కౌలు భూములు, బ్యారన్ల లీజు ధరలకు రెక్కలు

వర్జీనియా ధరల పెరుగుదలతో కౌలు భూములకు, బ్యారన్‌ల లీజులకు ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. గత సీజన్లో బ్యారన్ లీజు రూ.90 వేలు ఉండగా వచ్చే సీజన్లో రూ.లక్ష 30 వేలకు పెరిగింది. అదేవిధంగా ఎకరం కౌలు భూమి రూ.50 వేల నుంచి రూ.65 వేలకు చేరుకుంది. ఇప్పటికే లీజుదారులు అడ్వాన్సులు చెల్లించి వచ్చే సీజన్‌కు సమాయత్తం అవుతున్నారు. నాణ్యమైన పొగాకు ఉత్పత్తి జరిగే వ్యవసాయ భూములలో ఎకరం రూ.లక్షకు కౌలు ధర చేరిందని బోర్డు అధికారి ఒకరు తెలిపారు. అయితే ధరల పెరుగుదల అనేది కంపెనీలు సిండికేట్ కానంతవరకే అనీ, ఏవేళనైనా వారు సిండికేట్ అయితే మరుక్షణం ప్రస్తుతం ఉన్న ధరల స్థిరత్వమో, లేక ధరల తిరోగమనమో జరిగే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. నాణ్యమైన పొగాకు మాత్రమే కంపెనీలు కొనుగోలు చేస్తుండగా, లో–గ్రేడ్ పొగాకును కూడా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. లోగ్రేడ్ పొగాకు రూ.300 లోపు వస్తుండడం వల్ల రైతుకు సరాసరి గిట్టుబాటు ధర రావడం లేదన్నారు.

నిల్వ ఉంచితే నాణ్యత ఉండదు



ముమ్ముందు ధరలు పెరుగుతాయని ఉద్దేశంతో అమ్మడం ఇష్టం లేక కొందరు రైతులు వేలం కేంద్రాలకు బేళ్లను తీసుకురావడం లేదు. బోర్డు అధికారులు సూచించిన క్వాంటిటీ ప్రకారం బేళ్లు విక్రయించుకుంటే లబ్ధి కలుగుతుంది. బేళ్లు నిల్వ ఉంచుకోవడం వల్ల పొగాకు నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది.

– గ్రేసీ మార్గరెట్ వేలం నిర్వహణ అధికారిణి.

లో–గ్రేడ్ కొనుగోలు చేయాలి



కంపెనీలు నాణ్యమైన పొగాకును కొనుగోలు చేయడానికి పోటీ పడుతున్నాయి. అదే సమయంలో లో–గ్రేడు కొనుగోళ్లు నిలిచిపోతున్నాయి. దీనివల్ల రైతుకు నష్టం కలుగుతుంది. లో–గ్రేడు పొగాకు సైతం ఇంచుమించు రూ.300లకు కొనుగోళ్లు జరిగినప్పుడే సరాసరి గిట్టుబాటు ధర రైతుకు లభిస్తుంది.

– వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది, దిప్పకాయల పాడు.